క్లుప్తంగా

పని తీరు మెరుగు పరచుకోవాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ అన్వరా బేగం

బండి ఆత్మకూరు: పని తీరును మెరుగు పరుచుకోవాలని డీఎల్‌డీఓ అన్వరాబేగం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలులో సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రతి సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ స్థాయిలో జరిగే ప్రతి చర్య పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గాయత్రి, ఈఓఆర్‌డీ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి కష్టాలు తీర్చాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న కొట్టాల చెరువుగూడెం ప్రజలు

ఆత్మకూరు: తాగు నీటి కష్టాలు తీర్చాలని కొట్టాలచెరువుగూడెం ప్రజలు మంగళవారం ఎంపీడీఓ ఉమ్మర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. నెల రోజుల క్రితం పైపులు పగిలిపోవడంతో సమస్య ఏర్పడిందని, విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గూడెం వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గిరిజన సంఘం నాయకులు, గ్రామ సర్పంచ్ నాగమ్మ, పెద్దబాలునాయక్, శంకర్‌నాయక్, శివనాయక్, మల్లికార్జుననాయక్ పాల్గొన్నారు.

పైలా చంద్రమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



పైలా చంద్రమ్మ చిత్ర పటం వద్ద జోహార్లు అర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: శ్రీకాకుళం పోరాట యోధురాలు పైలా చంద్రమ్మను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు సూచించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పైలా చంద్రమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పైలా చంద్రమ్మ భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం ఉద్యమించి ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. తాడిత, పీడిత ప్రజల కోసం దోపిడీ పీడన లేని సమాజం కోసం ఆమె ఊపిరి ఉన్నంత వరకు పోరాటం చేశారన్నారు. గిరిజన ప్రాంతాల్లో పోడు భూముల హక్కుల కోసం భర్త వాసుదేవరావు అడుగుజాడల్లోనే పోరాటాలు చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్‌కుమార్, మజీద్‌మియ్యా, శివ, ఆది తదితరులు పాల్గొన్నారు.

పొలాల రస్తాలు కబ్జా చేయొద్దు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు: రెవెన్యూ అధికారులు, సోలార్ గ్రీన్ కో కంపెనీ యజమాన్యం పైపాలెం గ్రామ పరిధిలోని పొలాల రస్తాలను కబ్జా చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మిడుతూరు మండలం పైపాలెం గ్రామ రైతులకు చెందిన భూముల రస్తాలను కబ్జా చేసిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల పట్టా భూములను ఎలాంటి ఆమోదం లేకుండా సోలార్ గ్రీన్ కో కంపెనీ పేరుతో కూటమి ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు, గ్రీన్ కో యజమాన్యం దౌర్జన్యంగా ఆక్రమించడం తగదన్నారు. రైతులకు తెలియకుండానే పట్టా భూముల్లో సోలార్ స్తంభాలు ఏర్పాటు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గ్రామానికి, పశువులకు ఉపయోగపడే చెరువులను, కుంటలను పూడ్చివేయడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేశ్వరరావు, రామకృష్ణ, ఓబులేసు, లింగస్వామి, ఉస్మాన్‌బాషా, రైతులు శివమూర్తి, శివకుమార్, నాగశేషులు, ఎల్లమ్మ, మాలిక్, మధు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా అమ్మవారు

దసరా శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ఆలయాల్లో అమ్మవార్లు రెండోరోజు మంగళవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామునుంచే పూజార్లు అమ్మవార్లకు మేల్కొలుపు పూజలు నిర్వహించి పంచామృతాభిషేకం, కలశారాధన, కుంకుమార్చన, ఆకుపూజ, నైవేద్యం, హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాయత్రీదేవిగా అలంకరించి కొలువుంచారు. భక్తులు ఆలయాలకు చేరుకుని కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం కొలనుభారతి దేవి ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు అమ్మవారి విగ్రహాన్ని నూతన వస్త్రాలంకరణ, ప్రాతఃకాల పూజాకార్యక్రమాలు, ఛారుఘోషిని నదీజలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పురోహితులు చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.



గాయత్రిదేవిగా కొలను భారతిదేవి అమ్మవారు

- పగిడ్యాల: మండల కేంద్రంలోని దుర్గా మాతా అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషపూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. అలాగే నెహ్రూనగర్, పగిడ్యాల, ముచ్చుమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట తదితర గ్రామాల్లో భక్తులు నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.



నెహ్రూనగర్‌లో గాయత్రీదేవి అలంకరణలో దుర్గామాతా అమ్మవారు

- బండిఆత్మకూరు: మండలంలోని ఓంకార క్షేత్రంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఓంకార క్షేత్రానికి తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఓంకార్ సిద్ధేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఈఓ నాగప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



- వెలుగోడు: పట్టణంలోని వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. అనంతరం ప్రాతఃకాల పూజలో భాగంగా శ్రీలలితా అష్టోత్తర శత నామార్చనలు, సప్తశతీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి త్రిశతీ దేవి ఖడ్గమాల నామావళి, లక్ష కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలాగే వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బ్రహ్మచారిణిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారు భక్తులకు బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు. చౌడేశ్వరిదేవి, అంబాభవానీ, కిషన్‌సింగ్ వీధిలో వెలిసిన ఆలయంలో, పాత బస్టాండు శివాలయంలో పార్వతీదేవి, వెంకటేశ్వర, మార్కండేయస్వామి, అయ్యప్పస్వామి, సాయిబాబా ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. జంబులమ్మ ఆలయంలోనూ, కప్పలకుంట్లలోని ఎల్లమ్మ ఆలయంలోనూ అమ్మవార్లు గాయత్రీ మాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.



- నందికొట్కూరు: పట్టణంలోని శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవార్లు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మిడుతూరు వాసవీవి కన్యకా అమ్మవారి ఆలయంలోనూ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ భూమా కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నందికొట్కూరులో గాయత్రీ దేవిగా అమ్మవారు



మిడుతూరులో..

- పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ మాతా ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి పూజలు చేశారు.



- జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడులోని వీరభద్రస్వామి, జూపాడు బంగ్లాలోని సుంకులాపరమేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లు గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జూపాడుబంగ్లా క్వార్టర్స్ కాలనీలో వెలసిన సరస్వతీ అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో దర్శనమిచ్చారు.



మహానందిలో బ్రహ్మచారిణీ దుర్గగా..





శతచండీయాగంలో పాల్గొన్న భక్తులు

మహానంది: దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు బ్రహ్మచారిణి దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మహానందిలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఋత్వికులు విశేష పూజలు చేశారు. ఉభయదాతల ఆధ్వర్యంలో రుద్రహోమం, శతచండీయాగం, చండీ మూలమంత్ర జపాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. అలంకార మండపంలో అమ్మవారికి సహస్రదీపాలంకరణ పూజలు నిర్వహించారు. వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరాజు పాల్గొన్నారు.

పీ4 సర్వేను పూర్తి చేయాలి



సూచనలిస్తున్న అధికారులు

వెలుగోడు: పీ4 సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం పీ4 కార్యక్రమంపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు సిబ్బందిని మ్యాపింగ్ చేశామన్నారు. సచివాలయ సిబ్బంది ఎవరికి కేటాయించిన కుటుంబాలను వారు క్రమం తప్పకుండా సంప్రదించడంతో పాటు మార్గదర్శులతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు.

- పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పీ4 సర్వే ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ బంగారు కుటుంబాలు, మార్గదర్శకులకు వారధిగా ఉంటూ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.
- కొత్తపల్లి: పీ4 సర్వేను వేగవంతం చేయాలని నియోజకవర్గ పీ4 మాస్టర్ ట్రైనర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సచివాలయ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బరావు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలి

పాములపాడు: బంగారు కుటుంబాలకు, మార్గదర్శకులకు వారధిగా ఉండి వారి కుటుంబాల అభివృద్ధికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలని డివిజన్ డీడీఓ అన్వరాబేగం సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పీ 4 కార్యక్రమంపై మొదటి బ్యాచ్ కింద మండలంలోని బానుముక్కల, బానకచెర్ల, చెలిమిల్ల, యర్రగూడూరు, ఇస్కాల, జూటూరు-1, జూటూరు-2 గ్రామ సచివాలయాల సిబ్బందికి ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాస్టర్ ట్రైనర్స్ అబ్దుల్ సలాం, జిలానీ బాషా, గౌస్‌లు సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఎస్‌ఓ తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రజని

పాములపాడు: మహిళలు బలంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అన్నారు. స్వస్థ నారీ - స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ మాట్లాడుతూ క్యాన్సర్ తదితర వ్యాధులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలురోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు మేకల భాగ్యమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్లు నాగలక్ష్మి, మహ్మద్‌బేగ్, రజని, ఆయుష్ డాక్టర్ సావిత్రి, కంటి వైద్యులు షేక్షావలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రక్తదానం చేస్తున్న యువకులు

జూపాడుబంగ్లా: మహిళలు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పారుమంచాల పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, జూపాడుబంగ్లా డాక్టర్ సభా తెలిపారు. మంగళవారం పారుమంచాల పీహెచ్‌సీ ఆవరణలో స్వస్థ నారీ - స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వ్యాపించే వ్యాధులు-నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ మహిళలకు రొమ్ము, నోటి, గొంతు క్యాన్సర్ వ్యాపించే అవకాశాలున్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వెంటనే చికిత్స పొందితే ఉపశమనం పొందవచ్చన్నారు. అనంతరం శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు.

గిరిజన మహిళలకు వైద్య పరీక్షలు



గిరిజన మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ, నాగలూటి చెంచుగూడేల్లో మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బైర్లూటీ వైద్యాధికారి బేతం హర్షం మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు వైద్యుల సలహాలను పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. అనంతరం గిరిజన మహిళలకు పాలు, గుడ్లు, ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అలుగు ఎక్కి ప్రవహిస్తున్న నీళ్లు



బుక్కాపురం వద్ద రోడ్డెక్కి పారుతున్న నీళ్లు

మహానంది: మహానంది నుంచి నంద్యాల వెళ్లే మార్గంలో బుక్కాపురం వద్ద తమ్మడపల్లె ఇంజవాణి చెరువు నిండిపోవడంతో అలుగు ఎక్కి నీరు ప్రవహిస్తోంది. రోడ్డుపై రెండు అడుగుల మేర నీరు పారుతుండటంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించి బుక్కాపురం వద్ద వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

మళ్లీ వర్షం..

మహానంది మండలంలో మంగళవారం సాయంత్రం విడతల వారీగా వర్షం కురిసింది. పంటపొలాల్లో మొక్కజొన్న దిగుబడులను ఆరబోసుకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన ధరలు లేక విక్రయించడం లేదని, వర్షాలు మరింత ఇబ్బందికి గురిచేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: రుణాలను సద్వినియోగం చేసుకోవాలని 80బన్నూరు సహకార సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, సీఈఓ చంద్రశేఖర్‌గౌడు తెలిపారు. మంగళవారం సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సొసైటీకి లాంగ్ టర్మ్ రుణాలు రూ.1.50 కోట్లు మంజూరు కాగా అందులో రూ.50 లక్షల రుణాలు ఇచ్చామన్నారు. దీర్ఘకాళిక రుణాలుగా ఎకరాకు మార్టిగేజ్ ద్వారా రూ.1.95 లక్ష ల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. మరో రూ.12 లక్షల పంట రుణాలు మంజూరయ్యాయన్నారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. సొసైటీకి 50 టన్నుల యూరియా మంజూ రుకు ప్రతిపాదనలు పంపగా 36 టన్నులు మంజూరైందన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలున్న రైతులకు రెండు బస్తాల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు.

పరిహారం అందించాలని ..



ఇన్‌చార్జ్ ఏడీఏ హేమలతకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పాములపాడు: భవనాశి నది వల్ల ఏటా తీవ్రంగా నష్టపోతున్న ప్రతి రైతుకు పరిహారం ఇవ్వాలని ఇస్కాల గ్రామ రైతులు మంగళవారం ఇన్‌చార్జ్ ఏడీఏ హేమలతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు శేషులు, విజయ్‌కుమార్, ప్రసాద్ మాట్లాడుతూ భవనాశి నది విస్తరణ లేకపోవడంతో వర్షపు నీరు పంట పొలాల్లోకి చేరి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలన్నారు. పార్టీల కతీతంగా నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి

కొత్తపల్లి: సమయపాలన పాటించాలని ఎంపీడీఓ మేరి సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం గువ్వలకుంట్ల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమయ పాటించకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బరావు ఉన్నారు.

ఆయుర్వేద దినోత్సవం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 'ఆయుర్వేద ఫర్ పీపుల్ అండ్ ప్లానెట్' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.ఎం.బుచ్చయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకులు డా.వై.కిరణ్‌కుమార్, ఎస్.మహేశ్వరరెడ్డి, ఎస్.పూర్ణేశ్వరరెడ్డి, ఎస్.శివనాగిరెడ్డి, టి.ఇందిరా ప్రియదర్శిణి, షాహీదా, బి.మీనాక్షి పాల్గొన్నారు.

తాగునీటికి బోర్లు వేయండి



ఐటీడీఏ పీఓ శివప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న చెంచులు

శ్రీశైలంప్రాజెక్ట్: తమ గూడెంలో బోర్లు చెడిపోయి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయని ప్రకాశం జిల్లా నక్కంటి చెంచుగిరిజన గూడెం సులు మల్లికార్జున, వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు సున్నిపెంట ఐటీడీఏ కార్యాలయంలో పీఓ కె.వెంకటశివప్రసాద్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. నెక్కంటి బేస్‌క్యాంప్‌లో చెంచులకు ఇవ్వాల్సిన ఉద్యోగాలను ఇతర కులాల వారికి ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. వర్షాలకు గుడిసెలు తడిసి కారుతున్నాయని తారుపట్టాలను పంపిణీ చేయాలని కోరారు. వ్యక్తిగత రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. వినతులు సమర్పించిన వారిలో కొమరంభీం చెంచుగిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వై.ఆశీర్వాదం, నాయకులు పోలయ్య, వీరన్న, అంజన్న, పోతన్న, బయన్న, నాగన్న, గురవయ్య, పోలయ్య తదితరులు ఉన్నారు.

అక్షరాంధ్రలో భాగస్వాములు కావాలి



వలంటీర్లకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాములపాడు: ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని వయోజన విద్య ఏడీ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో మండల వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ చదువు నేర్చుకుని అక్షరాస్యులు కావాలన్నారు. వలంటీర్లు ఒక్కొక్కరు 10 మందికి చొప్పున చదువు నేర్పించాలన్నారు. చదువు ఉపయోగాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం వలంటర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వయోజన విద్య నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాసులు ఏపీఎం ఉమామహేశ్వరి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

- వెలుగోడు: సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమం తోడ్పడుతోందని వయోజన విద్యా నోడల్ ఆఫీసర్ బీవీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటరీల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికులకు చదువు నేర్పించేందుకు అక్షరాస్యులైన మేటీలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఏపీఓ నాగజ్యోతి పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి



కాలనీలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణ శివారులోని ఆర్డీటీ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణ. ధీర్, పట్టణ నాయకులు జి.నాగేశ్వరరావ్ అన్నారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరులో భాగంలో కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లపై ఆగిన మురుగునీటిలో నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా తయారవుతుండటంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీటీ కాలనీ వాసులు దర్గమ్మ, సుజాత, రమణమ్మ, చిన్నమ్మ, జయమ్మ, అరుణ, మాదన్న, మల్లయ్య, సురేష్, నాగరాజు, రమణ, శివ, రమేష్, రమణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కొత్తపల్లి: దుద్యాల పశువైద్యకేంద్రాన్ని ఆత్మకూరు ఇన్‌చార్జ్ సహాయక సంచాలకుడు డాక్టర్ వెకంటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని రైతులకు సూచించారు. దుద్యాలలో పందుల పెంపకం యూనిట్‌ను పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి బుధవారం కోళ్లకు కొక్కెర తెగులు వ్యాధి నివారణ టీకాలు వేయిస్తున్నామన్నారు. 75 శాతం సబ్సిడీతో అందిస్తున్న గడ్డి జొన్నలను వినియోగించుకుని పశుగ్రాస పెంపకం చేపట్టుకోవాలని రైతులకు చెప్పారు. రూ.150లకే అందిస్తున్న 90 శాతం పెయ్యదూడలు మాత్రమే పొందేందుకు రైతు సోదరులు ఎద సూదులు వినియోగించుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న మినీ గోకులాలు, గడ్డి జొన్నలు అన్ని రకాల వ్యాధి నివారణ టీకాలు వినియోగించుకుని పాల ఉత్పత్తి పెంచాలన్నారు. కార్యక్రమంలో దుద్యాల పశువైద్యాధికారి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

యూరియా కృత్రిమ కొరత

జూపాడుబంగ్లా: యూరియా కృత్రిమ కొరత సృష్టించి చిన్న, సన్నకారు రైతులకు దక్కకుండా చేస్తున్నారని వ్యకాస జిల్లా నాయకుడు కర్ణ, సీఐటీయూ నాయకుడు రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పారుమంచాల గ్రామంలో వ్యవసాయ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పలుకుబడి ఉన్న బడా రైతులకు యూరియా లభిస్తుందని, సన్న, చిన్న కారు రైతులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియాను కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుంటే విజిలెన్స్ అధికారులు నామమాత్రపు దాడులు నిర్వహించి చేతులు దులుపుకోవటం సబబుకాదన్నారు. అనంతరం నూతన వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఎన్నుకున్నారు.

గోపవరంలో చోరీ

మహానంది: గోపవరం గ్రామానికి చెందిన కాగుల లక్ష్మీదేవి ఇంట్లో చోరీ జరిగింది. నాగరాజు, లక్ష్మీదేవి దంపతులు ఈనెల 21న డోన్‌కు వెళ్లారు. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని రెండు తులాల రెండు జతల కమ్మలు, నాలుగు లక్ష్మీకాసుల బంగారు బిల్లలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి చెప్పారు.